## రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి

సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కే.హైమావతి

3




మనం
మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

మంగళవారం । 13 । అక్టోబర్ । 2026 పేజీలు: 12




# జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

నీటి లభ్యత ఆధారంగా ఆరుతడి పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలి

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్





*సంగారెడ్డి, అక్టోబర్ 12 మనం న్యూస్ ప్రతినిధి : ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైన నేపథ్యంలో జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. యాసంగి 2026-27 సీజన్లో అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల లభ్యత, విద్యుత్ సరఫరా పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని రైతులు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.*

2

## సేవ్ ఓట్ - సేవ్ డెమోక్రసీతో ఢిల్లీలో ప్రతిపక్షాల నిరసన గళం




2

- ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం.. ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలి
- చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొన్న సిద్దిపేట కాంగ్రెస్ ఇన్చార్జి పూజల హరికృష్ణ
- ఎన్నికల సంఘం తీరుపై నిరసన.. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామాకు డిమాండ్

## పదేళ్ల పండుగ... పది తరాలకు గుర్తుండిపోయే వేడుక!

- సిద్దిపేట జిల్లా వైభవాన్ని నలుదిశలా చాటిన జిల్లా పండుగ
- ముగింపు సభ విజయవంతం కావడంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు హర్షం.. పండుగలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- జిల్లా ప్రగతిని చాటిన పదేళ్ల పండుగ.. ప్రజల భాగస్వామ్యమే విజయానికి నిదర్శనం
- మీడియా, సోషల్ మీడియా ప్రచారంతో ప్రపంచానికి చాటిన సిద్దిపేట ఖ్యాతి
- విద్యార్థుల నుంచి విశ్రాంత ఉద్యోగుల వరకు.. అన్ని వర్గాల ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యం
- నాటి నుంచి నేటి వరకు జిల్లా ప్రస్థానాన్ని ఆవిష్కరించిన డాక్యుమెంటరీ
- జిల్లా అభివృద్ధిలో ఇదే స్ఫూర్తి నిరంతరం కొనసాగాలి: హరీశ్ రావు

3



# జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

**ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి**

**నీటి లభ్యత ఆధారంగా ఆరుతడి పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలి**

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**





సంగారెడ్డి, అక్టోబర్ 12 మనం న్యూస్ ప్రతినిధి :-

ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైన నేపథ్యంలో జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. యాసంగి 2026-27 సీజన్లో అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల లభ్యత, విద్యుత్ సరఫరా పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని రైతులు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

ఎల్ నినో ప్రభావం, యాసంగి పంటల ప్రణాళిక, ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, నీటి వినియోగం, విద్యుత్ సరఫరా, పశుగ్రాసం, తాగునీటి సంరక్షణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులు, రైతులతో కలిసి సంగారెడ్డి రైతు వేదిక నుంచి పాల్గొన్నారు.

హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయ అనుబంధ శాఖల కార్యదర్శులు, శాస్త్రవేత్తలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొని ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ యాసంగి సీజన్లో నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పప్పుధాన్యాలైన పెసలు, మినుములు, శనగతో పాటు కుసుమ వంటి పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. బిందు సేద్యాన్ని వినియోగించుకొని ఆయిల్పామ్ తోటలు, కూరగాయలు తదితర పంటలను సాగు చేయడం ద్వారా నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు.

జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోరు బావుల రీఛార్జ్ వంటి పనులను చేపట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని సూచించారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా విషయంలో సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. భూగర్భ జలాల పరిస్థితిపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ, రైతులు నీటి లభ్యత ఆధారంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావాన్ని సమష్టి కృషితో సమర్థవంతంగా ఎదుర్కోవాలని, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, పంటల ఎంపిక, సాగు పద్ధతులపై అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని ఆదేశించారు.

జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలని, నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదల, నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వర్, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వసంతకుమారి, జిల్లా సహకార అధికారి కిరణ్ కుమార్, డీఆర్డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

---

## సేవ్ ఓట్ - సేవ్ డెమోక్రసీతో

# ఢిల్లీలో ప్రతిపక్షాల నిరసన గళం

**- ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం.. ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలి**

**- చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొన్న సిద్దిపేట కాంగ్రెస్ ఇన్చార్జి పూజల హరికృష్ణ**

**- ఎన్నికల సంఘం తీరుపై నిరసన.. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామాకు డిమాండ్**




మనం న్యూస్ - సిద్దిపేట రిపోర్టర్ అక్టోబర్ 12: దేశంలో ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ వ్యవస్థల స్వతంత్రతను కాపాడటమే లక్ష్యంగా కాంగ్రెస్ అగ్రనేత, లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన 'సేవ్ ఓట్ - సేవ్ డెమోక్రసీ' అఖిలపక్ష మహా ధర్నాలో సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి ఆయన ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు.




ఈ సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో 'సేవ్ ఓట్ - సేవ్ డెమోక్రసీ' నినాదం మార్మోగింది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి పౌరుడి ఓటుకు సమాన విలువ ఉండేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని నిరసనకారులు స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి తప్పనిసరిగా ఉండాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల సంఘం పనితీరుపై ప్రతిపక్ష పార్టీలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను ప్రస్తావిస్తూ, ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని నాయకులు కోరారు. ఓటర్ల జాబితాల రూపకల్పన నుంచి ఎన్నికల నిర్వహణ వరకు ప్రతి దశలోనూ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలనే డిమాండ్తో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ రాజీనామా చేయాలని ఈ ధర్నా వేదికగా నిరసనకారులు డిమాండ్ చేశారు.

రాజ్యాంగబద్ధమైన సంస్థలపై ప్రజలకు విశ్వాసం నిలవాలంటే వాటి పనితీరు పారదర్శకంగా ఉండాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కుకు భంగం కలిగించే పరిణామాలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడుతూ... ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, ఓటు హక్కు పవిత్రతను కాపాడేందుకు పార్టీ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు ప్రజలంతా తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

---



# లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**రూ.13.135 లక్షల విలువైన 50 చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**

మనం న్యూస్,సదాశివపేట అక్టోబర్ 12 : సదాశివపేట మండలానికి చెందిన 28 మంది, సదాశివపేట పట్టణానికి చెందిన 22 మంది లబ్ధిదారులకు మొత్తం 50 సీఎం రిలీఫ్ ఫండ్ ( ఎఫ్ సీఎం ఆర్ ఎఫ్ ) చెక్కులను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సదాశివపేట లోని తన నివాసం గృహం లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రూ.13,135 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించడంలో సీఎం రిలీఫ్ ఫండ్ కీలకంగా ఉపయోగపడుతుందని అయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, చిల మల్లన్న, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధీర్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి వీరేశం, మైనార్టీ అధ్యక్షుడు కామేల్, సర్పంచులు తొంట కిష్టయ్య, నాగరాజ్, నవీన్ కుమార్, ప్రమోద్, లక్ష్మయ్య, కౌన్సిలర్లు నజీర్, విజయ్, కలీం పటేల్, సంక్షే గౌడ్, మాజీ సర్పంచులు లక్ష్మారెడ్డి, మానయ్య, కుందే నరాజు, సలావొద్దీన్, సిద్ధన్న, కరుణాకర్, దాసు, రాములు, మాజీ ఎంపిటీసీలు అశోక్, సుధాకర్, మాజీ సొసైటీ వైస్ చైర్మన్ పాండునాయక్తో పాటు నాయకులు యాదగౌడ్, శివకుమార్, డిదిగే నాగేష్, లతీఫ్, రాజశేఖర్ రెడ్డి, శివ, మానయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్ల పండుగ... పది తరాలకు గుర్తుండిపోయే వేడుక!

- సిద్దిపేట జిల్లా వైభవాన్ని నలుదిశలా చాటిన జిల్లా పండుగ
- ముగింపు సభ విజయవంతం కావడంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు హర్షం.. పండుగలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- జిల్లా ప్రగతిని చాటిన పదేళ్ల పండుగ.. ప్రజల భాగస్వామ్యమే విజయానికి నిదర్శనం
- మీడియా, సోషల్ మీడియా ప్రచారంతో ప్రపంచానికి చాటిన సిద్దిపేట ఖ్యాతి
- విద్యార్థుల నుంచి విశ్రాంత ఉద్యోగుల వరకు.. అన్ని వర్గాల ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యం
- నాటి నుంచి నేటి వరకు జిల్లా ప్రస్థానాన్ని ఆవిష్కరించిన డాక్యుమెంటరీ
- జిల్లా అభివృద్ధిలో ఇదే స్ఫూర్తి నిరంతరం కొనసాగాలి: హరీశ్ రావు

మనం న్యూస్ - సిద్దిపేట రిపోర్టర్ అక్టోబర్ 12: సిద్దిపేట జిల్లా ఏర్పాటు జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన జిల్లా పదేళ్ల పండుగ పది తరాలకు గుర్తుండిపోయేలా అద్భుతంగా జరిగిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా వైభవాన్ని, అభివృద్ధి ప్రస్థానాన్ని, ప్రజల ఐక్యతను నలుదిశలా చాటిచెప్పేలా నిర్వహించిన మూడు రోజుల వేడుకలు విజయవంతం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జిల్లా పండుగ ముగింపు సభకు భారీగా తరలివచ్చిన ప్రజలకు, వేడుకల నిర్వహణలో కీలక పాత్ర పోషించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రజల భాగస్వామ్యంతో.. చరిత్రలో నిలిచిపోయే వేడుకలు

సిద్దిపేట జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా పండుగ నిర్వహించాలని నిర్ణయించిన నాటి నుంచి ముగింపు సభ వరకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని హరీశ్ రావు పేర్కొన్నారు. జిల్లా పండుగను విజయవంతం చేయాలనే సంకల్పంతో అనేకమంది తమవంతుగా ముందుకొచ్చి వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. సన్నాహక సమావేశంలో పలువురు తమ విలువైన సలహాలు, సూచనలు అందించారని, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని మూడు రోజులపాటు వేడుకలను ఘనంగా నిర్వహించామని వివరించారు.

ఈ పండుగ ఒక కార్యక్రమానికి మాత్రమే పరిమితం కాకుండా జిల్లా ప్రజల ఐక్యతకు, సిద్దిపేటపై వారికున్న అభిమానానికి, జిల్లా అభివృద్ధిపై ఉన్న ఆకాంక్షకు ప్రతీకగా నిలిచిందన్నారు. విద్యార్థులు, యువత, వ్యాపారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, మహిళలు, వివిధ రంగాలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావడం జిల్లా పండుగకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చిందని పేర్కొన్నారు.

### మీడియా ప్రచారం.. సోషల్ మీడియాలో జిల్లా ఖ్యాతి

జిల్లా పదేళ్ల పండుగ విశిష్టతను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా మిత్రులు అందించిన సహకారం అభినందనీయమని హరీశ్ రావు అన్నారు. పత్రికల్లో ప్రత్యేక కథనాలు, వార్తా కథనాలు ప్రచురించడంతోపాటు యూట్యూబ్ ఛానళ్ల ద్వారా సిద్దిపేట జిల్లా ప్రగతి, వైభవం, పండుగ విశేషాలను విస్తృతంగా ప్రజలకు చేరవేశారని తెలిపారు.

అదేవిధంగా సోషల్ మీడియా వేదికగా పలువురు తమవంతుగా అద్భుతమైన ప్రచారం నిర్వహించి జిల్లా పండుగ స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పారని కొనియాడారు. ఎవరికి వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి జిల్లా ఖ్యాతిని మరింత విస్తృతం చేయడం



సంతోషకరమన్నారు. పండుగ విజయవంతం కావడానికి సహకరించిన మీడియా ప్రతినిధులు, డిజిటల్ మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా కార్యకర్తలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### ప్రతి రంగం భాగస్వామ్యం.. జిల్లా ఐక్యతకు నిదర్శనం

జిల్లా పండుగలో కవులు, కళాకారులు, జర్నలిస్టులు, వైద్యులు, న్యాయవాదులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, వ్యాపారులు, విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు తదితరులు భాగస్వాములయ్యారని హరీశ్ రావు తెలిపారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, సంఘాల ప్రతినిధులు తమ సహకారం అందించి వేడుకలను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.

జిల్లా పండుగ నిర్వహణలో సూచనలు అందించినవారు, కార్యక్రమాలను రూపొందించినవారు, ప్రత్యక్షంగా పాల్గొన్నవారు, తెరవెనుక ఉండి సహకరించినవారు.. ఇలా ప్రతి ఒక్కరి కృషి ప్రశంసనీయమని అన్నారు. ఈ వేడుకను తమ సొంత పండుగగా భావించి ప్రజలు చూపిన చొరవ సిద్దిపేట జిల్లా ప్రత్యేకతను మరోసారి చాటిచెప్పిందని పేర్కొన్నారు.

### జిల్లా ప్రగతికి అద్దం పట్టిన డాక్యుమెంటరీ

సిద్దిపేట జిల్లా ఏర్పాటుకు ముందు పరిస్థితుల నుంచి నేటి వరకు చోటుచేసుకున్న పరిణామాలు, అభివృద్ధి ప్రస్థానాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన డాక్యుమెంటరీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని హరీశ్ రావు అన్నారు. జిల్లా ప్రస్థానాన్ని, సాధించిన పురోగతిని ప్రజలకు వివరించడంలో ఈ డాక్యుమెంటరీ ఎంతగానో దోహదపడిందని పేర్కొన్నారు. పదేళ్ల ప్రయాణాన్ని ఒకచోట ఆవిష్కరించడం ద్వారా జిల్లా అభివృద్ధి దిశను, భవిష్యత్తుపై ప్రజల ఆకాంక్షలను చాటిచెప్పగలిగామని తెలిపారు.

### ఈ స్ఫూర్తి అభివృద్ధిలోనూ కొనసాగాలి

జిల్లా పదేళ్ల పండుగను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానని హరీశ్ రావు పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ రంగాల ప్రముఖులు, మీడియా మిత్రులు సమష్టిగా అందించిన సహకారం మరువలేనిదని అన్నారు.

పండుగ సందర్భంగా వెల్లివిరిసిన ఐక్యత, ఉత్సాహం, సిద్దిపేటపై ప్రజల అభిమానం భవిష్యత్తులోనూ కొనసాగాలని ఆకాంక్షించారు. జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం, సిద్దిపేట ఖ్యాతిని మరింత పెంచే ప్రతి ప్రయత్నంలోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పదేళ్ల పండుగ విజయవంతం కావడం వెనుక ప్రతి ఒక్కరి కృషి ఉందని, ఈ ఘనత జిల్లా ప్రజలందరిదని హరీశ్ రావు స్పష్టం చేశారు.

---

# రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి

### కే.హైమావతి సిద్దిపేట జిల్లా కలెక్టర్

హుస్నాబాద్, రిపోర్టర్:అక్టోబర్ 12, మనం న్యూస్: ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైన నేపథ్యంలో నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి రైతులకు సూచించారు. రబీ సీజన్లో వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సోమవారం హుస్నాబాద్ రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు







పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రంలోని 315 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని, త్వరలో కరువు మండలాలను ప్రకటించే అవకాశం ఉందని తెలిపారు. బిందు సేద్యంతో ఆయిల్పామ్ తోటలు, కూరగాయలు, ఇతర స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని సూచించారు. ఇంకుడు గుంతలు, నీటి కుంటలు ఏర్పాటు చేయడంతోపాటు బోరుబావుల రీఛార్జ్ ద్వారా భూగర్భ జలాలను సంరక్షించుకోవాలని పేర్కొన్నారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రైతులతో కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ఆరుతడి పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఎల్నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని, రైతులు నష్టపోకుండా జిల్లా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి, జిల్లా ఉద్యాన అధికారి సువర్ణ, మున్సిపల్ చైర్పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్పర్సన్ చిత్తారి పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెన్న రాజు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# ఇంచార్జ్‌గా ఆదర్శ్ రెడ్డి తనదైన ముద్ర!

- కీలక సమయంలో బీఆర్ఎస్ బాధ్యతలు
- పార్టీకి ఎమ్మెల్యే దూరమైతే..ఆదర్శ్ రెడ్డి బలమయ్యారు
- సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక నుంచి గెలుపు వరకు సమన్వయ కృషి
- కేసీఆర్ ఆశీస్సులు.. కేటీఆర్, హరీశ్రావు సూచనలతో పార్టీ బలోపేతానికి చర్యలు
- రాజకీయ వారసత్వంతో పాటు తనదైన పనితీరుతో ప్రత్యేక గుర్తింపు










పటాన్‌చెరు, అక్టోబర్ 12 (మనం న్యూస్): రాజకీయాల్లో కీలక సమయంలో బాధ్యతలు చేపట్టడం ఒక ఎత్తయితే.. ఆ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ శ్రేణుల్లో విశ్వాసాన్ని నింపడం మరో ఎత్తు. ఈ రెండింటిలోనూ తనదైన శైలిలో ముందుకు సాగుతూ పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. పార్టీకి ప్రతికూల పరిస్థితులు ఎదురైన వేళ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పార్టీ కార్యక్రమాలు కొనసాగించడంలో చొరవ చూపారు. ఇంచార్జ్ బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తున్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తూ సమర్థవంతమైన నాయకుడిగా పేరు సంపాదిస్తున్నారు.

### కీలక సమయంలో బాధ్యతలు..క్యాడర్కు భరోసా

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బీఆర్ఎస్‌ను వీడిన నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 15న పార్టీ అధినేత కేసీఆర్ ఆదర్శ్ రెడ్డికి నియోజకవర్గ ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారు. పార్టీకి కీలకమైన సమయంలో లభించిన ఈ బాధ్యతలను ఆయన సవాలుగా స్వీకరించారు.

ఎమ్మెల్యే పార్టీకి దూరమైన పరిస్థితుల్లోనూ పార్టీ శ్రేణుల్లో సమన్వయం దెబ్బతినకుండా ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. పార్టీ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగేందుకు కృషి చేస్తూ క్యాడర్కు అండగా నిలిచారు. నాయకులు, కార్యకర్తలతో సంప్రదింపులు కొనసాగిస్తూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లారు. కీలక సమయంలో బాధ్యతలు స్వీకరించి క్యాడర్కు అండగా నిలవడం ద్వారా ఇంచార్జ్ తనదైన ముద్ర వేసుకున్నారు.

### ఎన్నికల్లో సమన్వయంతో ముందడుగు..

సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల సమయంలో ఆదర్శ్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి సమన్వయానికి ప్రాధాన్యమిచ్చారు. అభ్యర్థుల ఎంపికపై చర్చలు, స్థానిక నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, అభ్యర్థుల గెలుపు కోసం చేపట్టిన ప్రయత్నాల్లో తన వంతు పాత్ర పోషించారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల్లో పార్టీ కార్యకలాపాలు, ఎన్నికల ప్రక్రియలో నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేశారు. మాజీ మంత్రి హరీశ్రావు మార్గదర్శకత్వంలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగారు. ఎన్నికల సమయంలో క్షేత్రస్థాయి నాయకులతో సంప్రదింపులు జరుపుతూ, పార్టీ అభ్యర్థులకు సహకారం అందించే దిశగా వ్యవహరించడం ఆయన పాత్రలో ప్రధానాంశంగా నిలిచింది. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణలో సమన్వయకర్తగా ఆదర్శ్ రెడ్డి వ్యవహరించిన తీరుపై పార్టీ, రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### హరీశ్రావు సూచనలతో పార్టీ బలోపేతం..

కేసీఆర్ ఆశీస్సులు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గదర్శకత్వం, మాజీ మంత్రి హరీశ్రావు సూచనలతో ఆదర్శ్ రెడ్డి నియోజకవర్గంలో పార్టీ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు వేశారు. మండలాలు, కార్పొరేషన్ డివిజన్లకు పార్టీ ఇంచార్జ్ నియామకంలో సమన్వయ పాత్ర పోషించారు. పార్టీ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో చురుకుగా సాగేందుకు నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పని చేశారు. ఇంచార్జ్ పార్టీకి అవసరమైన సహకారం అందించడంతో పాటు, తన పరిధిలో ఆర్థికంగానూ తోడ్పాటు అందిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తిరిగి బీఆర్ఎస్‌లోకి వచ్చిన నేపథ్యంలోనూ ఆదర్శ్ రెడ్డి ఇంచార్జ్ బాధ్యతలు కొనసాగుతుండటం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

### రాజకీయ వారసత్వం.. తనదైన పనితీరు

ఆదర్శ్ రెడ్డికి రాజకీయ నేపథ్యం కూడా ఉంది. ఆయన తండ్రి రాజేశ్వర్ రెడ్డి గతంలో రామచంద్రాపురం సర్పంచ్గా పని చేశారు. ఆయన పెదనాన్న, మాజీ ఎమ్మెల్సీ, మాజీ ప్రొటెం చైర్మన్ భూపాల్ రెడ్డి రాజకీయ అనుభవం ఆదర్శ్ రెడ్డికి మార్గదర్శకంగా నిలిచింది. ఆదర్శ్ రెడ్డి సతీమణి సింధు ఆదర్శ్ రెడ్డి ఆయన సంపూర్ణ సహకారంతో రెండు సార్లు భారతి నగర్ కార్పొరేటర్ గా పని చేసి ప్రజల మన్ననలు పొందారు. పెద్దల రాజకీయ ప్రస్థానాన్ని దగ్గరగా గమనిస్తూ, వారితో కలిసి పనిచేసిన అనుభవాన్ని తన రాజకీయ ప్రయాణంలో ఉపయోగించుకుంటున్నారు. కుటుంబ రాజకీయ నేపథ్యంతో పాటు, పార్టీ అప్పగించిన బాధ్యతలను నిర్వహిస్తూ నియోజకవర్గ స్థాయిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్నారు.

### సమన్వయకర్తగా ప్రత్యేక గుర్తింపు..

కీలక సమయంలో ఇంచార్జ్ బాధ్యతలు స్వీకరించి, పార్టీకి ఎదురైన సవాళ్లను అధిగమించే దిశగా పనిచేస్తూ ఆదర్శ్ రెడ్డి తనదైన ముద్ర వేస్తున్నారు. నాయకత్వం సూచనలను పాటిస్తూ.. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం ఆయన పనితీరుల ప్రధానాంశంగా నిలుస్తోంది. పార్టీకి అండగా నిలవడంతో పాటు బాధ్యతాయుతమైన

ఇంచార్జ్ తన సామర్థ్యాన్ని చాటుకుంటున్నారనే చర్చ బీఆర్ఎస్ వర్గాల్లో వినిపిస్తోంది. రాజకీయంగా మారుతున్న పరిస్థితుల్లోనూ సమన్వయానికి ప్రాధాన్యమిస్తూ పార్టీ బలోపేతానికి ఆదర్శ రెడ్డి కృషి చేస్తున్నారు.

సమర్థవంతమైన సమన్వయకర్తగా, బాధ్యతలను సమర్థంగా నిర్వహించే బీఆర్ఎస్ నేతగా పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్‌లో ఆదర్శ్ రెడ్డి పేరు ప్రత్యేకంగా వినిపిస్తోంది.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ను తొలగించే వరకు నిరసనలు ఆగవు

- కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్
- తెలంగాణ భవన్ లో సీఎం, పీసీసీ, రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో జరిగిన సమావేశంలో పాల్గొన్న నీలం
- ఢిల్లీలోని బారకాంబ జంక్షన్ నుండి సుప్రీమ్ కోర్ట్ వరకు జరిగిన నిరసన మార్చ్ కార్యక్రమంలో హాజరు



పటాన్ చెరు, అక్టోబర్ 12 (మనం న్యూస్) : కేంద్ర ఎన్నికల సంఘం తీరును ఆక్షేపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి దిగిపోవాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీలోని బారకాంబ జంక్షన్ నుండి సుప్రీమ్ కోర్ట్ వరకు కాంగ్రెస్ అగ్రనేతల ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన మార్చ్ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో కలిసి ఆయన ఈ నిరసన ప్రదర్శనలో భాగస్వాములయ్యారు.

ఈ మార్చ్లో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి, సిఈసి వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.




ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ..ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సమీక్ష పేరుతో లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం, అధికార పార్టీకి కొమ్ము కాస్తూ రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను విస్మరిస్తోందని ఆరోపించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుడికి అతిపెద్ద ఆయుధమైన ఓటు హక్కును కాలరాసేందుకు జరుగుతున్న కుట్రలపై రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న ఈ పోరాటానికి తెలంగాణ కాంగ్రెస్ శ్రేణుల పూర్తి సన్నద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ను పదవి నుండి తొలగించి, ప్రజాస్వామ్య బద్ధంగా ఓటర్ల జాబితాలను పునరుద్ధరించే వరకు ఢిల్లీ వీధుల నుంచి గ్రామ స్థాయి వరకు ఈ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## రైతుల భూ సమస్యలు, విద్యుత్ కోతలు పరిష్కరించాలి

సందబోయిన ఎల్లయ్య



గజ్వేల్ అక్టోబర్ 12 మనం న్యూస్: గజ్వేల్ నియోజకవర్గం లో భూ సమస్యలు పరిష్కరించాలని, విద్యుత్ కోతలు అరికట్టాలని సిపిఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి ఫలితంగా పహాని రికార్డులలో పట్టాదారు కాలం మాత్రమే ఉండడంతో అనుభవదారి కాలం ఎత్తివేయడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత 20 30 సంవత్సరాల క్రితం కొన్న భూములు అనేక మంది పేద రైతులు పహాని రికార్డులు చూసుకోకపోవడంతో పూర్వీకుల నుండి వ్యవసాయం చేస్తున్న రికార్డులో మాత్రం వేరే ఇతరుల పేర్లు రావడం జరుగుతుందని ధనవంతులకు అందుబాటులో ఉన్న అధికారులు సాధారణ ప్రజలకు మాత్రం రికార్డులు మార్చడం ఇబ్బందులుగా మారుతున్నాయని అన్నారు. సంవత్సరాల తరబడి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగిన భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలిపారు. దీంతో భూమి తమది కాకుండా రికార్డులు వారి పేరుతో ఉండడంతో రాజకీయ పలుకుబడి, రియల్ ఎస్టేట్ బ్రోకర్ల అండతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి సాధారణ పేద రైతులను భయభ్రాంతులకు గురిచేసి భూముల నుండి దూరం చేస్తున్నారని అన్నారు నియోజకవర్గంలో జరిగిన భూమి రిజిస్ట్రేషన్ లపై సమగ్రంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతల తో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చేతికొచ్చిన పత్తి మొక్కజొన్న వరి పంటలు ఎండిపోతున్నాయని ఎలినో ప్రభావంతో వర్షాలు కూడా కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వం విద్యుత్ కోతలను నివారించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సందిటి రంగారెడ్డి, పొట్టేల స్వామి, ఉడిది నాగరాజు కాసం మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# నంగునూరు పీహెచ్‌సీలో గైనకాలజీ సేవలు అందుబాటులోకి

**గర్భిణులకు వైద్య సేవలు.. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల నిర్వహణ**

**గర్భిణులు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి: డాక్టర్ రమాదేవి**

నంగునూరు, అక్టోబర్ 12 మనం న్యూస్ :-సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గైనకాలజీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ రమాదేవి తెలిపారు. మండల పరిధిలోని గర్భిణీ స్త్రీలు, మహిళలకు అవసరమైన వైద్య సేవలను అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సదుపాయాలు ఉన్నాయని ఆమె వెల్లడించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన వైద్య సలహాలు, సూచనలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఈ సందర్భంగా డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ.. గర్భధారణ అనేది మహిళ జీవితంలో ఎంతో కీలకమైన దశ అని, ఈ సమయంలో తల్లి ఆరోగ్యంతో పాటు కడుపులోని బిడ్డ ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. గర్భం



దాల్చినప్పటి నుంచి వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భిణులు తమ ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు వైద్య సిబ్బందికి తెలియజేయాలని, వైద్యులు సూచించిన జాగ్రత్తలను పాటించాలని తెలిపారు.

గర్భధారణ సమయంలో తలెత్తే ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆమె సూచించారు. సరైన సమయంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. గర్భిణులు తమకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైనప్పుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్యుల సలహాలు తీసుకోవాలని తెలిపారు.

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గైనకాలజీ సేవలు అందుబాటులో ఉండటంతో పరిసర గ్రామాల మహిళలు కూడా ఈ సేవలను వినియోగించుకోవచ్చని డాక్టర్ రమాదేవి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించే వైద్య సేవలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, వైద్య సేవల కోసం ఆసుపత్రికి రావడానికి ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని కోరారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు ప్రసవానికి సంబంధించి ముందుగానే వైద్యులను సంప్రదించి తగిన సలహాలు పొందాలని సూచించారు.

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలకు తెలియజేయడం ద్వారా మహిళలు సకాలంలో వైద్య సహాయం పొందేందుకు అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. గర్భిణులు, వారి కుటుంబ సభ్యులు తల్లి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, వైద్య సిబ్బంది సూచనలను పాటిస్తూ ఆరోగ్యకరమైన ప్రసవం కోసం అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

# రైతులు ఇబ్బందులు పడుతుంటే సీఎం, మంత్రులు ఢిల్లీ చక్కర్లు కొడుతున్నారు

**లిక్కర్ కంపెనీలకు నీటి సరఫరాపై శ్రద్ధ.. రైతులకు సాగునీరు అందించడంలో నిర్లక్ష్యం**

**కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తీవ్ర విమర్శలు**

సంగారెడ్డి అక్టోబర్ 12 మనం న్యూస్ ప్రతినిధి : రాష్ట్రంలో రైతులు సాగునీరు, విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే వాటిని పరిష్కరించాల్సిన ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, మంత్రులు మాత్రం ఢిల్లీ పర్యటనలకే ప్రాధాన్యత ఇస్తున్నారని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విమర్శించారు.

తెలంగాణ రైతుల కష్టాల కంటే ఢిల్లీ కాంగ్రెస్ పార్టీ ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమయ్యాయని మండిపడ్డారు. రాష్ట్రంలో తాగునీరు, సాగునీటి సమస్యలపై దృష్టి సారించాల్సిన ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రైతులకు నీళ్లు ఇవ్వరు.. లిక్కర్ కంపెనీలకు మాత్రం సరఫరా చేస్తారా?**

రాష్ట్రంలో రైతులు నీటి కోసం ఇబ్బందులు పడుతుంటే బీర్, లిక్కర్ కంపెనీలకు నీటిని సరఫరా చేయడంపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ రైతులకు సాగునీరు అందించడంలో కనిపించడం లేదని చింతా ప్రభాకర్ విమర్శించారు. సింగూరు ప్రాజెక్టులోని నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాల్సి ఉండగా, లిక్కర్ కంపెనీలకు నీటి సరఫరా విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఆరోపించారు. లిక్కర్ కంపెనీలకు నీటి కొరత రాకూడదని అబ్కారీ మంత్రి చెబుతున్నారని, మరి రైతులకు నీటి కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు.

లిక్కర్ కంపెనీలపై ఉన్న ప్రేమ రైతులపై ఎందుకు లేదని ప్రశ్నించిన ఎమ్మెల్యే, రైతుల ప్రయోజనాలను పక్కనపెట్టి కంపెనీల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వడం



సరికాదన్నారు. నీటి వనరుల వినియోగంలో ప్రజల తాగునీటి అవసరాలు, రైతుల సాగునీటి అవసరాలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో ఎల్నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారే అవకాశాలున్నప్పటికీ, వాటిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయడంలో విఫలమైందని చింతా ప్రభాకర్ ఆరోపించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి నిర్వహణ, రైతులకు సాగునీటి సరఫరా, పంటల రక్షణ, విద్యుత్ సరఫరాపై సమగ్ర కార్యాచరణ రూపొందించాల్సి ఉందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతోనే రాష్ట్రంలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారరు .

ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రభుత్వ వైఫల్యం కారణంగానే రాష్ట్రంలో విద్యుత్ కోతల సమస్య మొదలైందని ఎమ్మెల్యే విమర్శించారు. వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే నీటి సమస్యతో సతమతమవుతున్న రైతులకు విద్యుత్ కోతలు మరింత భారంగా మారుతున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు అవసరమైన విద్యుత్, సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు రైతు వేదికల వద్దకు రావాలని అధికారుల ద్వారా ఉదయం ఫోన్ చేసి సమాచారం అందించి, చివరి నిమిషంలో ఆ కార్యక్రమాన్ని రద్దు చేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని చింతా ప్రభాకర్ మండిపడ్డారు. రైతులు ఎదుర్కొంటున్న గంభీరమైన సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు కనుగొనాల్సిన సమయంలో సమావేశాలను రద్దు చేయడం ఏమిటని ప్రశ్నించారు.

రాష్ట్రంలో తాగునీరు, సాగునీటి సమస్యలపై చర్చించాల్సిన మంత్రుల సమావేశాన్ని అర్ధాంతరంగా రద్దు చేసి ఢిల్లీ పర్యటనలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. ప్రజలు, రైతుల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత కావాలని హితవు పలికారు.

తెలంగాణ ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా ఢిల్లీ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా పర్యటనలు చేయడంపై చింతా ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. రైతుల పంటలు, సాగునీరు, విద్యుత్ సమస్యలు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని నిలదీశారు. రాష్ట్ర ప్రజల అవసరాలను పక్కనపెట్టి పార్టీ రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం సిగ్గుచేటన్నారు.

ప్రభుత్వం ఇప్పటికైనా రాజకీయ పర్యటనలు, ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. నీటి వనరుల సమర్థ నిర్వహణ, తాగునీటికి ప్రాధాన్యత, సాగునీటి లభ్యత, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరాపై తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రైతుల కష్టాలను అర్థం చేసుకుని వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి, మంత్రులపై ఉందని చింతా ప్రభాకర్ స్పష్టం చేశారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత కావాలని, రైతులను నిర్లక్ష్యం చేస్తే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ధాన్యాలంకారములో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ మహంకాళీ మాత

**భారీగా తరలివచ్చిన భక్తులు**



గజ్వేల్ అక్టోబర్ 12 మనం న్యూస్. గజ్వేల్ పట్టణంలోని శ్రీ మహంకాళీ మాత ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం నాడు భక్తులకు ధాన్యాలంకారంలో భక్తులకు శ్రీ మహంకాళి మాత దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాలు గజ్వేల్ పట్టణంలోని ఆలయాలలో అమ్మవార్లను అందంగా అలంకరించడం తోపాటు భక్తి పారవశ్యంతో భక్తులు కొలిచే విధంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సంతోషిమాత ఆలయంలో, శ్రీ వాసవి మాత ఆలయం, అలాగే పట్టణంలో వివిధ ప్రాంతాలలో కూడా మండపాలు ఏర్పాటు చేసి అమ్మవారిని కొలువుతీరేలా చేశారు. ఈ మండపాల వద్ద భక్తులు భారీ సంఖ్యలో రావడంతో పాటు త్రమ భక్తిని చాటుకుంటున్నారు. 18 గంటల బియ్యంతో అమ్మవారికి అలంకరణ కార్యక్రమాన్ని ఆలయనిర్వాహకులు చాలా నంద బాల శర్మ నిర్వహించడం జరిగింది. అంతకుముందు ఉదయం ఆరు గంటల నుండి హోమం కార్యక్రమాన్ని నిర్వహించగా గోపూజ కలశ పూజలతో పాటు తదితర పూజా కార్యక్రమాలను భక్తులచే నిర్వహించారు.




# నూజివీడు ఆధ్య పత్తితో అధిక దిగుబడులు

**పత్తి రకం పనితీరును రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన**

**సీనియర్ రీజినల్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి**

మనం న్యూస్, వట్పల్లి, అక్టోబర్ 12:- వట్పల్లి మండలం మార్వెల్లి గ్రామానికి చెందిన రైతు పాండరి పత్తి చెనులో నూజివీడు సీడ్స్ ఆధ్వర్యంలో ఆధ్య 1134 మెగా పత్తి క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల రైతులు హాజరై పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా నూజివీడు సీడ్స్ సీనియర్ రీజినల్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఆధ్య పత్తి రకం త్వరగా కాపునకు వచ్చి రెండో పంట సాగుకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. అన్ని రకాల నేలల్లో సాగు చేసుకోవచ్చని, చీడపీడలను కొంతవరకు తట్టుకోవడంతో పాటు టొబాకో స్ట్రీక్ వైరస్ ప్రభావాన్ని, అధిక వర్షాలు, బెట్ట పరిస్థితులను తట్టుకునే లక్షణాలు ఉన్నాయని వివరించారు. అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసుకోవడానికి కూడా ఈ రకం అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. రైతు పాండరి చెనులో పత్తి మొక్కలకు సగటున 60 నుంచి 84 వరకు కాయలు ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ క్షేత్రంలో ఎకరాకు 12 నుంచి 14 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు అంచనా వేశారు. వివిధ వాతావరణ పరిస్థితుల్లో పత్తి రకం పనితీరును రైతులకు క్షేత్రస్థాయిలో వివరించారు. ఆధ్య పత్తి రకంపై రైతులు ఆసక్తి చూపించారు. ఈ సందర్భంగా పలువురు రైతులను సన్మానించారు. కార్యక్రమంలో నూజివీడు సీడ్స్ టీమ్ లీడర్ ప్రవీణ్ రెడ్డి, స్థానిక డీలర్ వి. శంకరయ్య, ఫర్టిలైజర్ యజమాని పాండరి, గ్రామ రైతులతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల నిజం చేస్తున్న ప్రజా ప్రభుత్వం

**- తోర్నల్ లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ షెట్కర్**







మనూర్, అక్టోబర్ 12 (మనం న్యూస్ ):నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండల పరిధిలోని తోర్నల్ గ్రామంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నూతనంగా నిర్మించిన ఇంటి గృహప్రవేశ వేడుక ఘనంగా జరిగింది.

గ్రామానికి చెందిన లబ్ధిదారులు ఒగ్గు రేఖ దత్తు దంపతుల నూతన గృహ ప్రవేశానికి నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ షెట్కర్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభించారు.

ఈ సందర్భంగా నగేష్ షెట్కర్ మాట్లాడుతూ... గత పదేళ్లలో పేదలకు ఇల్లు అనేది కలగానే మిగిలిపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే పేదల కల నిజమవుతోందని అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు.

ఇల్లు లేని నిరుపేద కుటుంబం ఉండకూడదనేదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే లక్షలాది ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

నూతన గృహంలో అడుగుపెట్టిన ఒగ్గు రేఖ దత్తు కుటుంబం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

అనంతరం గ్రామంలో 5 లక్షల రూపాయలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామానికి చెందిన ఏఈఈ అంజిరెడ్డి తల్లి ఇటీవల మరణించిన విషయం తెలుసుకుని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగమేశ్ పటేల్, ఉప సర్పంచ్ అంబోజి, మాజీ సర్పంచ్ సంగారెడ్డి, మల్లికార్జున్ పాటిల్, మాజీ మండల అధ్యక్షులు మాణిక్ రావు పటేల్, శివారెడ్డి, సంగయ్య స్వామి, కాలేద, గణపతి, సంతోష్ రెడ్డి, విజేందర్ రెడ్డి, రాజు, దత్తు రెడ్డి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

---



# బొంతపల్లి పారిశ్రామిక వాడలో విషవాయువులతో ఉక్కిరిబిక్కిరి

**వీరభద్ర నగర్, బొంతపల్లి కాలనీలను కుమ్మేస్తున్న విషవాయువులు.**

**ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పరిశ్రమల యాజమాన్యాలు.**

**ఊపిరి పీల్చుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్న స్థానిక ప్రజలు.**

**అనారోగ్యాలతో ఆసుపత్రుల చుట్టూ స్థానిక ప్రజల ప్రదక్షిణలు.**

**అభివృద్ధిని ఎరచూపి..... కాలుష్యాన్ని రెచ్చలవిడిగా వదులుతున్న యాజమాన్యాలు.**

**పరిశ్రమల యాజమాన్యాలతో కుమ్మక్కైన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు.**

గుమ్మడిదల ( మనం న్యూస్ ) అక్టోబర్ 12 : గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి పారిశ్రామికవాడలో కాలుష్యం తాండవమాడుతోందని చెప్పవచ్చు. అనుమానిత విషవాయువుల వలన స్వచ్ఛమైన గాలి కూడా పీల్చలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొంతపల్లి మరియు వీరభద్ర నగర్ కాలనీల్లో విషవాయువుల వలన రసాయన దుర్వాసన వెదజల్లడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని ఎప్పుడు ఎటువంటి అనారోగ్యాలు పాలవుతామో అని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా పిల్లలు మరియు వృద్ధుల్లో శ్వాస కోసం సంబంధిత సమస్యలు ఉన్న వారి ఆందోళన తీవ్రంగా ఉందని చెప్పవచ్చు. ధనార్జనయ ధ్యేయంగా ఓవైపు అభివృద్ధిని ఎరచూపి ప్రజల్లో భిన్నాభిప్రాయాలకు తావిస్తున్న పరిశ్రమల యాజమాన్యాల వైఖరికి నిదర్శనం. కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమలపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని పరిశ్రమల యాజమాన్యాలతో కుమ్మక్కై స్థానిక ప్రజలతో ఆడుకుంటున్నారని పిసిబి అధికారులపై స్థానికుల మండిపడుతున్నారు. ఇప్పటికైనా బొంతపల్లి పారిశ్రామిక వాడలోని పరిశ్రమల విడుదల చేస్తున్న కాలుష్యాన్ని తనిఖీ చేసి సంబంధిత పరిశ్రమపైచట్టపరమైన చర్యలు చేపట్టాలని లేనియెడల కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# పటాన్‌చెరు ప్రజావాణికి ఐదు దరఖాస్తులు





**- ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి**

**- పటాన్‌చెరు ఎంపీడీవో యాదగిరి**

పటాన్‌చెరు, అక్టోబర్ 12 (మనం న్యూస్): పటాన్‌చెరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి ఐదు దరఖాస్తులు అందాయి. గత రెండు వారాలుగా ప్రజావాణికి ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం గమనార్హం. ఈ వారం నిర్వహించిన కార్యక్రమానికి ఐదు దరఖాస్తులు రావడంతో అధికారులు వాటిని స్వీకరించి సంబంధిత శాఖలకు పంపించారు. సోమవారం అందిన ఐదు దరఖాస్తుల్లో మూడు ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్కు సంబంధించినవి కాగా, ఒకటి రెవెన్యూ శాఖకు, మరొకటి ఇంద్రేశం మున్సిపల్ కమిషనర్కు సంబంధించినవిగా ఎంపీడీవో యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజావాణి నోడల్ అధికారి, ఎంపీడీవో యాదగిరి మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునేందుకు ప్రజావాణి ఒక మంచి వేదిక అని చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు ఈ కార్యక్రమంలో దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్, ఎంఈఓ నాగేశ్వర్ నాయక్తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో పారదర్శకత కోసం కాంగ్రెస్ పోరాటం

**జంతర్ మంతర్ నిరసనలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి**



మనూర్, అక్టోబర్ 12 (మనం న్యూస్ ): ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమం హోరెత్తింది. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... దేశంలో ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా ఎన్నికల సంఘం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల నిర్వహణ అత్యంత కీలకమని, ఓటు హక్కు పవిత్రతను కాపాడటం, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించడం ఎన్నికల సంఘం బాధ్యత అని పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేస్తూ, ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఎన్నికల వ్యవస్థలో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.





# కబ్జాపై చర్యలు.. ప్రహరీ గోడకే పరిమితమా?

**230 గజాల ఆక్రమణపై నోటీసులు.. కూల్చివేతలో మాత్రం పాక్షిక చర్యలే!**

**ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన సంతోష్‌రెడ్డి**





సంగారెడ్డి అక్టోబర్ 11 మనం న్యూస్ ప్రతిని ధి :ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారుల చర్యలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. అమీన్పూర్ మండలం కిష్టారెడ్డిపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 164లో ప్రభుత్వ భూమి ఆక్రమణ వ్యవహారంలో ప్రహరీ గోడను కూల్చివేసిన అధికారులు, మిగిలిన నిర్మాణాలపై చర్యలు తీసుకోలేదన్న అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సుమారు 230 గజాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు నోటీసుల్లో పేర్కొన్నప్పటికీ, కూల్చివేత ప్రహరీ గోడకే పరిమితమైందని ఫిర్యాదుదారుడు సంతోష్రెడ్డి ఆరోపించారు.

**నోటీసుల్లో 230 గజాలు.. చర్యల్లో ప్రహరీ గోడేనా?**

ఈ వ్యవహారంపై సంతోష్రెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, ఆర్డీవో తహశీల్దార్కు ఫోన్ చేసి వివరాలు అడిగినట్లు తెలిపారు. దీనికి స్పందిస్తూ ప్రహరీ గోడ మాత్రమే కూల్చివేత పరిధిలోకి వస్తుందని తహశీల్దార్ చెప్పినట్లు పేర్కొన్నారు. అయితే, సంబంధిత బిల్డర్కు జారీ చేసిన నోటీసులో 230 గజాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు ప్రస్తావించారని గుర్తుచేశారు. నోటీసుల్లో విస్తీర్ణాన్ని పేర్కొంటూ, ఉన్నతాధికారులకు మాత్రం ప్రహరీ గోడ గురించే వివరించడం ఏమిటని ప్రశ్నించారు.

**పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలి**

ప్రభుత్వ భూమి ఆక్రమణపై గతంలో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి, తెలంగాణ భూ ఆక్రమణల నిరోధక చట్టం-1905లోని సెక్షన్ 7 కింద సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అయినప్పటికీ, ఆక్రమణకు గురైన స్థలంలో పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వే నంబర్ 164లో ప్రభుత్వ భూమి హద్దులను నిర్ధారించి, ఆక్రమణకు గురైన స్థలాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని సంతోష్రెడ్డి ఉన్నతాధికారులను కోరారు. మిగిలిన నిర్మాణాలపై కూడా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

# రాహుల్ గాంధీకి మద్దతుగా సంగారెడ్డిలో జగ్గారెడ్డి, నిర్మల వారి ర్యాలీ

**దేశంలో ఓటు చోరీ జరుగుతుంది బీజేపీ హక్కులను కాలరాస్తుంది.**

**ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు రాహుల్ గాంధీ పోరాటం ఆపబోమని ప్రకటన.**

**ఆయన డిమాండ్ నెరవేరేవరకు ఆయనకు మద్దతుగా సంగారెడ్డిలో నా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది జగ్గారెడ్డి**








సంగారెడ్డి అక్టోబర్ 12 మనం న్యూస్ ప్రతినిధి : కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఢిల్లీలో చేస్తున్న పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సోమవారం నాడు సంగారెడ్డి పట్టణ కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక హైబి గెస్ట్ హౌస్ నుండి ఓల్ బస్టాండ్ వరకు సాగిన ర్యాలీలో నిర్మల జగ్గారెడ్డి తో పాటు వేలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. గణేష్ కుమార్ రాజీనామా చేయాలని మోడీ డౌన్ డౌన్ రాహుల్ గాంధీ జిందాబాద్ అంటూ ర్యాలీ పొడవున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ బీజేపీ దొంగ ఓట్లతో అధికారంలోకి వస్తుందని ఆరోపించారు ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ వీధుల్లోకి వచ్చి పోరాడుతున్నారని ఆయనకు మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలు నిరసనలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ ఢిల్లీలో రోడ్లపై పోరాడుతుంటే మనం ఇళ్లల్లో విశ్రాంతి తీసుకోవడం సరైనకు మద్దతుగా మనమందరం వీధుల్లో కిరావాల్సిందేనని అన్నారు తాను ఢిల్లీ వెళ్లే గలిగినప్పటికీ రాహుల్ గాంధీ పోరాటానికి స్థానికంగా సంఘీభావం తెలియజేయాలని ఉద్దేశంతో సంగారెడ్డి లోనే ఉండి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోర్ట్ చివరి జరుగుతుంది బిజెపి ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తుందని జగ్గారెడ్డి ఆరోపించారు ఈ అంశాలను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కనీసం పదిమందికి వివరించి ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు మ్యారేజ్ కుమార్ రాజీనామా చేసి వరకు పోరాటం ఆపబోమని రాహుల్ గాంధీ ప్రకటించారని జగ్గారెడ్డి పేర్కొన్నారు ఆ డిమాండ్ నెరవేరే వరకు సంగారెడ్డిలో నిరసనలు కొనసాగుతూనే ఉంటాయని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ రోడ్డుపై పడుకుని నిరసన తెలిపే మనం కూడా అదే విధంగా ఆయనకు మద్దతుగా నిలవాలని ప్రతి కార్యకర్తకు జగ్గారెడ్డి పిలుపునిచ్చారు.

# విద్యాధరి క్షేత్రంలో వైభవంగా కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు

**గాయత్రి దేవిగా దర్శనం ఇచ్చిన అమ్మవారు.**



వర్గల్ అక్టోబర్ 12(మనం న్యూస్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వర్గల్ శ్రీ విద్యా సరస్వతి అమ్మవారి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు తొమ్మిది రోజులపాటు భక్తులకు వివిధ అలంకారంతో దర్శనం ఇవ్వనున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవిద్యా సరస్వతి అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో గణపతి పూజ విశేష పంచామృత అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి గాయత్రి దేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకుని పునీతులైనారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదాలను అందజేశారు.

# ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్లు**



సంగారెడ్డి, అక్టోబర్ 12 మనం న్యూస్ ప్రతినిధి. : ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు పాండు, సంగీత అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 69 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, వెంటనే ఆన్లైన్లో నమోదు చేయడంతో పాటు పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

డివిజన్ల వారీగా సంగారెడ్డి నుంచి 15, నారాయణఖేడ్ నుంచి 2, జహీరాబాద్ నుంచి 2 అర్జీలు అందగా, కలెక్టరేట్లో 50 అర్జీలు స్వీకరించారు. అందోల్ డివిజన్ నుంచి ఎలాంటి అర్జీలు అందలేదు. ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలపై అర్జీలు సమర్పించాలని అదనపు కలెక్టర్లు సూచించారు.

ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి, హౌసింగ్ పీడీ చలపతిరావు, అదనపు డీఆర్డీఓ బాలరాజ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జా నాయక్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అడ్వకేట్ ఆర్. గౌతమి, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఈఈ ఎస్.కె. పాషా, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ భూములు అక్రమ నిర్మాణం

**కబ్జాకు గురైన భూమిని కాపాడాలంటూ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన స్థానికులు.**

సంగారెడ్డి అక్టోబర్ 12 మనం న్యూస్ ప్రతినిధి : సంగారెడ్డి పట్టణ కేంద్రంలోని లేఔట్లేని ప్రభుత్వ భూంలో అక్రమ నిర్మాణం తొలగించి భూమిని కాపాడాలంటూ సోమవారం నాడు జిల్లా కలెక్టర్ కు సంగారెడ్డి పట్టణంలోని రాజంపేట కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. రాజంపేట గాలిపోచమ్మ ఆలయం వద్ద ఉన్న సర్వేనెంబర్ 374 లోని ఇందిరా కాలనీ లేఅవుట్ నెంబర్ 282/79 లో దాదాపు 14 గుంటల ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని కబ్జాకు పాల్పడి రాత్రికి రాత్రి నిర్మాణాలు చేస్తున్నారని కాలనీవాసులు కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. ఇట్టి అక్రమ నిర్మాణం పై తాసిల్దార్ సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్లకు ఫిర్యాదు చేసిన అక్రమ నిర్మాణం ఆపడం లేదని వెంటనే నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ లేఅవుటు లేని భూమి కాపాడాలని కోరుతూ సంగారెడ్డి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దొడ్డి భూపాల్, విట్టల్ అల్లూరి లక్ష్మణ్, పూజారి ప్రభాకర్ మోహిత్ భాషా ఆంజనేయులు అశోక్ సామాజిక కార్యకర్త శ్రీధర్ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు





## పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలి

**– ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి**

రామచంద్రపురం, అక్టోబర్ 12 (మనం న్యూస్) : పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ముందుకు సాగాలని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. నూతనంగా నియమితులైన సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గానికి చెందిన బీజేపీ డివిజన్ ప్రెసిడెంట్లు, నూతన కార్యవర్గ సభ్యులు రామచంద్రపురంలోని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్సీ ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికులా పని చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకూ తీసుకెళ్లి ప్రజల్లో పార్టీ పట్టును మరింత బలోపేతం చేయాలని కోరారు. స్థానిక సమస్యలపై ఎల్లప్పుడూ ప్రజాక్షేత్రంలో పోరాటాలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గోదావరి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, బీజేపీ నాయకులు కొండా లక్ష్మణ్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

## రాయికోడ్‌లో రబీ శనగ విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

**సోమవారం నుంచి టోకెన్ల జారీ – రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సారిక పిలుపు**



మనం న్యూస్ రాయికోడ్ మండలం అక్టోబర్ 12: సంగారెడ్డి జిల్లారాయికోడ్ మండలంలో రబీ సీజన్ కు సంబంధించిన శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సారిక తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రైతులకు ప్రభుత్వ రాయితీపై శనగ విత్తనాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో సంచి ఇరవై ఐదు కిలోల చొప్పున, ధర వెయ్యి ఐదు వందల రూపాయలకు అందజేయనున్నట్లు వెల్లడించారు. విత్తనాల పంపిణీ కార్యక్రమం సోమవారం ఉదయం పదకొండు గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు.

విత్తనాల కోసం వచ్చే రైతులు తప్పనిసరిగా తమ వెంట ఆధార్ కార్డు నకలు, భూమి పట్టాదారు పుస్తకం నకలు తీసుకురావాలని సూచించారు.

టోకెన్ల పంపిణీ కోసం రాయికోడ్ మరియు ఇటికేపల్లి రైతు వేదికల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. రాయికోడ్ రైతు వేదిక వద్ద వ్యవసాయ విస్తరణ అధికారులు నిఖిలేష్, అర్చనశ్రీ, కల్పన అందుబాటులో ఉంటారని, ఇటికేపల్లి రైతు వేదిక వద్ద వ్యవసాయ విస్తరణ అధికారులు శివకుమార్, మమత, లక్ష్మీకాంత్ లు టోకెన్లు జారీ చేస్తారని తెలిపారు. కావున మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సకాలంలో టోకెన్లు పొంది నాణ్యమైన విత్తనాలను పొందాలని ఆమె కోరారు.

# అంబరాన్ని అంటిన ఆచార్య డిగ్రీ కళాశాల విద్యార్థుల బతుకమ్మ సంబరాలు

జహీరాబాద్ అక్టోబరు 12 మనం న్యూస్: జహీరాబాద్ పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ వన్, టూ, త్రీ, ఫోర్ అండ్ ఫైవ్ ఆధ్వర్యంలో షెట్కార్ ఫంక్షన్ హాలులో ప్రారంభమైన బతుకమ్మ సంబరాలకు జహీరాబాద్ డిఎస్ పి బానోత్ సైదా నాయక్ ముఖ్య అతిథిగా హాజరై, ఆచార్య విద్యార్థులు తయారుచేసిన బతుకమ్మలకు పూజకార్యక్రమాలు నిర్వహించి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎస్ పి బానోత్ సైదా నాయక్ మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులకు ఈ పూల పండుగ ఎంతో గౌరవాన్ని, ఆనందాన్ని కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. బతుకమ్మ గొప్పతనాన్ని చెబుతూ మనిషికి అందం లేదని, అంతస్తులు లేవని, నిరాశ చెందకూడదని ఎడారిలో ఎవరు పట్టించుకోని తంగేడు పువ్వు







పొలంలో కలుపు మొక్కగా ఎదిగిన గుణగపువ్వు నేడు మనందరి ఇళ్లల్లో గౌరమ్మగా గర్భగుడిలో చేరి అందరి చేత చప్పట్లతో ప్రశంసలు పొందుతూ మనకంటూ ఒకరోజు వస్తుందని ఆశతో గొప్పగా బతకాలంటూ బతుకు చిత్రాన్ని తెలియజేసే పండుగే బతుకమ్మ పండుగ అని ఆయన విడమరిచి వివరించారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో రంగులమయం కావాలని ఆయన ఆకాంక్షించారు. విద్యతో పాటు మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడి వచ్చే తరాలకు అందించే బాధ్యత నేటి యువతపై ఉందని ఆయన నొక్కి వక్కాణించారు.యావత్తు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కేవలం మన తెలంగాణా రాష్ట్రంలోనే పువ్వుల పండుగను ఘనంగా జరుపుకుంటారని డిఎస్ పి బానోత్ సైదా నాయక్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ ఆర్ రవికుమార్, పట్టణ ఎస్ఐ ఎన్ లవ్ కుమార్, జహీరాబాద్ పట్టణ2 ఎస్ఐ పుష్పలతారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ జి మాధవి ఆత్మీయ అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆటపాటలతో మన సంస్కృతి సంప్రదాయాలతో నృత్యాలు చేసి అంబరాన్ని అంటే విధంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టరు చింతల హరికుమార్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు వెంకటరామిరెడ్డి, శ్వేతా స్వాతి, శ్రీనివాస్ రెడ్డి, రేణుక, శ్రీకాంత్, తృప్తి షెట్కార్ లతో పాటు అధ్యాపక బృందం నందుగౌడ్, రమేష్, వెంకటేశం, దత్తు, మదన్ మోహన్, నవీన, నిఖిత, దీపిక, జగదేవి, శ్వేత, నవనీత, సల్మా, ఆయేషా లతో పాటు 800 మంది విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై సమాధానం చెప్పాలని డిమాండ్

**నంగునూరు అక్టోబర్ 12 మనం న్యూస్:- సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కేంద్రంలో**

బీఆర్ఎస్ నేతలు తమ కుటుంబ ప్రయోజనాలు, అవినీతి అక్రమాల కోసమే సిద్దిపేట ప్రజలు మరోసారి ఉద్యమం చేయాలని పిలుపును ఇస్తున్నారని టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవులపల్లి యాదగిరి విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తున్నట్లు చెబుతూ మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. నంగునూరులో సోమవారం మీడియాతో మాట్లాడుతూ

తెలంగాణ ఉద్యమ సమయంలో నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ప్రజలను, నిరుద్యోగులను ఉద్యమంలోకి తీసుకు వచ్చారని చెప్పారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఉద్యమకారులకు, నిరుద్యోగులకు అన్యాయం చేశారని విమర్శించారు. తమను ప్రశ్నించిన వారిపై బీఆర్ఎస్ నాయకులు అక్రమ కేసులు నమోదు చేసి జైళ్లకు పంపించారని విమర్శించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని ఆరోపించారు. ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతకు సంబంధించిన అంశాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వర్షాలు పడకూడదనే ధోరణితో బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారని

కూర జైపాల్ రెడ్డికి టికెట్ ఇవ్వకుండా అన్యాయం



చేశారని యాదగిరి ఆరోపించారు. ఈ విషయంలో ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. సిద్దిపేట నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తీసుకున్న చర్యలేమిటో బీ ఆర్ ఎస్ నాయకులు వివరించాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలు, సాగునీరు, విద్యుత్ సరఫరా, నిరుద్యోగం వంటి అంశాలపై రాజకీయ నాయకులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని యాదగిరి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ గంగుల రవి, మాజీ సర్పంచ్ చెర్యాల బాలయ్య, భాస్వరాజ్ రాములు, పంగ రాజశేఖరరెడ్డి, సుద్దాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అనంతారంలో పంటలు ఎండిపోతున్నాయి

**కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరెంట్ కష్టాలు.**

**సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్.**

**బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు, సి జి ఆర్ ఫౌండేషన్ చైర్మన్: చిమ్ముల. గోవర్ధన్ రెడ్డి.**

గుమ్మడిదల ( మనం న్యూస్ ) అక్టోబర్ 12 : గుమ్మడిదల మండల పరిధిలోని అనంతారం గ్రామంలో విద్యుత్ సరఫరా అంతరాయం వలన పంటలు ఎండిపోతున్నాయని బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు, సి జి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చిమ్ముల. గోవర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నాడు



అనంతారం గ్రామ రైతులు తో కలిసి పంటలను ఆయన పరిశీలించారు. వ్యవసాయానికి అత్యంత అవసరమైన సమయంలో నీరు అందక భూములు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడమే కాక మానసికంగా ఆందోళనకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యల వలన సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టి రైతుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనంతారం సర్పంచ్ కొమ్ము. శ్రీను, ఉప సర్పంచ్ యాదిరెడ్డి, నాయకులు జింక. గోపాల్, మహేష్ యాదవ్, తలారి. మహేష్, శ్రీశైలం, కృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ..

# పోలీసు ఉద్యోగ సాధనకు సువర్ణావకాశం

**జహీరాబాద్ నియోజకవర్గం యువతకు 45 రోజుల పాటు శిక్షణ**

**జహీరాబాద్ డిఎస్ పి బానోత్ సైదా నాయక్**

జహీరాబాద్ అక్టోబరు 12 మనం న్యూస్: నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించి, పోలీసు ఉద్యోగ సాధన కోసం జిల్లా కలెక్టరు ప్రతీక్ జైన్, జిల్లా ఎస్ పి పంకజ్ పరితోష్ లు కల్పించిన సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ డిఎస్ పి బానోత్ సైదా నాయక్ కోరారు. జహీరాబాద్ నియోజక వర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు పోలీసు ఉద్యోగాల సాధనలో అండగా నిలిచేందుకు సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ, జిల్లా రెవిన్యూ యంత్రాంగం సంయుక్తంగా ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమని ఆయన అభివర్ణించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా మారనుందని ఆయన చెప్పారు.పోలీసు కానిస్టేబుల్ (పిసి), సబ్ ఇన్ స్పెక్టరు ఆఫ పోలీసు (ఎస్ఐపి)ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు నగరాలకు వెళ్లి ప్రైవేట్ కోచింగ్ తీసుకోవాలంటే అధిక మొత్తంలో ఫీజులు చెల్లించాల్సి వస్తోందని ఆయన గుర్తు చేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా నాణ్యమైన శిక్షణ



పొందలేని గ్రామీణ యువతకు ఈ ఉచిత శిక్షణ ఒక గొప్ప అవకాశంగా నిలవనుందని డిఎస్పీ జోస్యం చెప్పారు. హైదరాబాద్కు చెందిన ప్రముఖ షైన్ ఇండియా ఇన్స్టిట్యూట్ నిపుణులైన అధ్యాపకులతో 45 రోజుల పాటు శిక్షణ అందించడం ద్వారా అభ్యర్థులకు పరీక్షలపై అవగాహన పెరగడంతో పాటు ఉద్యోగ సాధనకు అవసరమైన సన్నద్ధత లభించనుందని ఆయన గుర్తు చేశారు. జహీరాబాద్ పట్టణంలోని ఆర్ ఎల్ ఆర్ పాఠశాలలో మొత్తం 45 రోజులపాటు నిరుద్యోగ యువకులకు పోలీస్ ఉద్యోగ సాధన నిమిత్తం ప్రత్యేక శిక్షణ తరగతులను పేరొందిన అనుభవజ్ఞులైనశిక్షకులచే శిక్షణ అందిస్తారని చెప్పారు.



గతంలో ఎస్ ఐ కానిస్టేబుల్ ఫ్రీ కోచింగ్ నిమిత్తం మొత్తం 558 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారికి నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్ లో మొత్తం 265 మంది అభ్యర్థులు అర్హత సాధించాలని డిఎస్ పి బానోత్ సైదా నాయక్ వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్డీఓ దేవుజా నాయక్, పట్టణ,రూరల్ సిఐలు ఆర్ రవీందర్, నర్సింహా, ఆర్ ఎల్ ఆర్ పాఠశాల వ్యవస్థాపక సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టరు ప్రొఫెసర్ డాక్టరు లక్ష్మారెడ్డి, వివిధ ప్రాంతాల ఎస్ ఐలు, తదితరులు పాల్గొన్నారు.

**అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి...**

జహీరాబాద్ పట్టణ, ఝరాసంగం ఎస్ఐ లు ఎన్ లవకుమార్, క్రాంతి కుమార్ పాటిల్ ఈ సందర్భంగా జహీరాబాద్, ఝరాసంగం ఎస్ఐ లు ఎన్ లవకుమార్, క్రాంతి కుమార్ పాటిల్ లు మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులకు ఎంతగానో ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు. ప్రభుత్వం, పోలీసు శాఖ కల్పిస్తున్న ఈ సువర్ణావకాశాన్ని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుతూ, పట్టుదలతో సాధన చేసి పోలీస్ ఉద్యోగాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

గ్రామీణ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి సరైన మార్గదర్శకత్వం అందించడంలో ఇటువంటి ఉచిత శిక్షణా కార్యక్రమాలు కీలక పాత్ర పోషించనున్నాయి. ఆర్థిక పరిస్థితులు ప్రతిభకు అడ్డంకి కాకుండా, యువత తమ లక్ష్యాలను చేరుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టరు, జిల్లా ఎస్పీ లకు నిరుద్యోగ యువకులు జహీరాబాద్ ప్రాంత వాసులు రుణపడి ఉంటారన్న అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేశారు.

---

# అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలో పర్యటించిన సీఎంసి కమిషనర్ సృజన

**- జోనల్, డిప్యూటీ కమిషనర్లతో కలిసి అభివృద్ధి పనుల పరిశీలన**

**- స్థానికులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులతో అభివృద్ధి పనులపై చర్చ**





అమీన్పూర్, అక్టోబర్ 12 (మనం న్యూస్): అమీన్పూర్ సర్కిల్-47 పరిధిలో సోమవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ జి.సృజన పర్యటించారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ తో కలిసి సర్కిల్ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ పర్యటనలో మొత్తం రూ.4.95 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఏడు అభివృద్ధి పనుల పురోగతిని కమిషనర్ సృజన సమీక్షించారు. అమీన్పూర్ సర్కిల్ పరిధిలో రహదారులు, వర్షపు నీటి పారుదల వ్యవస్థలు, ఫుట్పాత్లు, సెంట్రల్ మీడియన్, కమ్యూనిటీ హాల్ నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన ఏడు పనులను అధికారులు పరిశీలించారు. స్థానికులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులతో మాట్లాడి ఆయా ప్రాంతాల్లోని సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన అంశాలపై చర్చించారు. రామచంద్రాపురం పరిధిలోని కాకతీయ నగర్ కాలనీలో నిర్మిస్తున్నమహిళా భవనం కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణ పనులను పరిశీలించారు. బీహెచ్ఈఎల్ మెట్రో ప్రాంతంలో వర్షపు నీటి పారుదల వ్యవస్థ నిర్మాణ పనులను పరిశీలించారు. బీరంగూడ పరిధిలోని బీహెచ్ఈఎల్ మెట్రో ప్రాంతంలో సీసీ రోడ్డు, అమీన్పూర్ నరేంద్ర కాలనీ నుంచి దుర్గా ప్రావిన్స్, సాయిరాం ఎన్క్లేవ్ వరకు చేపడుతున్న వర్షపు నీటి కాలువ నిర్మాణ పనులను సమీక్షించారు. సన్వే ఓపస్ నుంచి చేతన్ ఆనంద్ బ్యాడ్మింటన్ అకాడమీ రోడ్డు వరకు ఫుట్పాత్ నిర్మాణ పనులను, అదే మార్గంలో సెంట్రల్ మీడియన్ నిర్మాణ పనులను,అమీన్పూర్ శ్రీ వాణి నగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను కమిషనర్ సృజన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ సృజన మాట్లాడుతూ.. జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అమీన్ పూర్ సర్కిల్ పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ పుష్ప నాగేష్, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో షార్టు బౌండరీ క్రికెట్ టోర్నమెంటు ప్రారంభం

**అలీ పూర్ ఎంఆర్ హెచ్ఎస్ క్రీడా మైదానంలో యునైటెడ్ క్రిష్టియన్ షాట్ బౌండరీ క్రికెట్ నిర్వహణ**

**గెలుపొందిన జట్టుకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేసిన జర్నలిస్టు జగన్**

**టోర్నమెంట్ నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన జర్నలిస్టు**

జహీరాబాద్ అక్టోబరు 12 మనం న్యూస్: జహీరాబాద్ పట్టణంలోని అలీపూర్ గ్రామ ఎంఆర్ హెచ్ఎస్ ఉన్నత పాఠశాల మైదానంలో యునైటెడ్ క్రిష్టియన్ సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటు క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. గెలిచినవారు పొంగిపోకుండా, ఓడినవారు కృంగిపోకుండా ముందుకు సాగి క్రమశిక్షణతో ఆడినప్పుడే అనుకున్న విజయం సాధించగరని మున్సిపల్ కౌన్సిలరు మహేష్ మార్క్, జర్నలిస్టు జగన్ లు అన్నారు. క్రీడలు ప్రతి ఒక్కరిని మనస్ఫూర్తిగా అక్కున చేర్చుకుని, ఏలాంటి భేషజాలకు పోకుండా నిరుత్సాహానికి లోను కాకుండా రక్షణ కవ చంలా పనిచెస్తాయని చెప్పారు. సోమవారంనాడు పట్టణంలోని ఎంఆర్ హెచ్ఎస్ మైదానంలో యునైటెడ్ క్రిస్టియన్ షార్టు బాల్ టోర్నమెంటును పురస్కరించుకొని నిర్వాహకుల ఆహ్వానం మేరకు జర్నలిస్టు జగన్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. గెలుపొందిన జట్టుకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు51 అందించడం జరిగింది.ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఆధునిక కాలం యువతరం సెల్ ఫోన్ ల బాట పట్టడం ఆందోళనకరమని అన్నారు.ప్రతి గ్రామాల్లో ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడం వల్ల మనం యువతకు సన్మార్గంలో నడిపే వారమవుతామని, ప్రతి గ్రామంలో సర్పంచులు చొరవ తీసుకొని ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించాలని కోరారు. విజేతలకు 51 వెయ్యిల నగదుతో పాటు విన్నర్ ట్రోఫిని, ఫైనల్ ఓడినా జట్టును 31 వెయ్యిల నగదుతో పాటు రన్నర్ అప్ ట్రాఫిని నిర్వాహకులు మున్సిపల్ కౌన్సిలరు సోని ఇర్మీయా అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్ర మంలో నిర్వాహకులు ప్రవీణ్ కుమార్, స్వరాజ్, అబ్దుల్లా సిద్ధిఖి జర్నలిస్టు, మున్నా పిచరేగాడి, చింటూ, నాథన్ తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ మోసాలపై అప్రమత్తతే అసలైన రక్షణ

**- తెలియని లింక్ క్లిక్ చేసే ముందు ఆలోచించాలి...**

**- ఓటీపీ చెబితే ఖాతా ఖాళీ కావచ్చు... సీపీ రష్మి పెరుమాళ్**

**- సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు**







మనం న్యూస్ - సిద్దిపేట రిపోర్టర్ అక్టోబర్ 12: ఆధునిక సాంకేతికత అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుంటూనే, సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ సూచించారు. సైబర్ మోసాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే క్షణాల్లోనే కష్టార్జిత సంపాదనను కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నిర్వహించిన సైబర్ క్రైమ్ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె.. విద్యార్థులు, కళాశాల సిబ్బందికి సైబర్ భద్రతపై విలువైన సూచనలు చేశారు.

## ఒక్క ఫోన్ కాల్తో మోసపోవద్దు!

సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసం చేసేందుకు రోజుకో కొత్త పద్ధతిని అనుసరిస్తున్నారని సీపీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనకు ఎదురైన ఓ అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. తనకు కూడా ఒకసారి అనుమానాస్పద ఫోన్ కాల్ వచ్చిందని, ముఖ్యమైన పార్శిల్ డెలివరీ చేయాల్సి ఉందని నమ్మించి, ఒక నంబర్కు వచ్చిన పిన్ లేదా ఓటీపీని చెప్పాలని కోరారని వెల్లడించారు.

ఆన్లైన్లో వస్తువులు ఆర్డర్ చేసిన సందర్భాల్లో లేదా ఇతర పనుల్లో నిమగ్నమై ఉన్నప్పుడు ఇలాంటి కాల్స్ వస్తే అప్రమత్తత కోల్పోయే అవకాశం ఉంటుందని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు అడిగినంత మాత్రాన ఓటీపీ, పిన్ నంబర్లు, బ్యాంకు వివరాలు వెల్లడించకూడదని స్పష్టం చేశారు. అనుమానాస్పద కాల్స్లో ఎక్కువసేపు సంభాషించకుండా వెంటనే అప్రమత్తం కావాలని సూచించారు.

## చిన్న నిర్లక్ష్యం.. భారీ ఆర్థిక నష్టం!

బ్యాంకు ఖాతాలు, డిజిటల్ లావాదేవీల భద్రతకు బలమైన పాస్వర్డ్లను ఉపయోగించాలని, వాటిని ఎప్పటికప్పుడు మార్చుకుంటూ ఉండాలని సీపీ సూచించారు. సైబర్ భద్రతకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిర్లక్ష్యం చేయకుండా పాటించాలని తెలిపారు. ఏదైనా అనుమానాస్పద లింక్ మొబైల్కు వచ్చినప్పుడు వెంటనే క్లిక్ చేయకుండా, అది ఎందుకు వచ్చిందో, దాని వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటో ఆలోచించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

ఆగండి.. ఆలోచించండి.. ఆ తర్వాతే స్పందించండి అనే అప్రమత్తతను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. వ్యక్తిగత అప్రమత్తతతో పాటు కుటుంబ సభ్యులకు, బంధువులకు, స్నేహితులకు కూడా సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని కోరారు.

## పిల్లల మొబైల్ వినియోగంపై తల్లిదండ్రుల నిఘా అవసరం

పిల్లలు, యువత పెద్దల మొబైల్ ఫోన్లను ఉపయోగిస్తున్నప్పుడు తెలియని లింక్లపై క్లిక్ చేయడం, నమ్మదగని ఆన్లైన్ గేమింగ్ ప్లాట్ఫారమ్లను వినియోగించడం వంటి అంశాలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీపీ సూచించారు. పబ్లిక్ ప్రదేశాల్లోని అసురక్షిత వై-ఫై నెట్వర్క్లను ఉపయోగించడం వల్ల వ్యక్తిగత సమాచారం ప్రమాదంలో పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

మొబైల్ ఫోన్లలో బ్యాంకింగ్ సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ప్రతి విషయాన్ని బహిరంగంగా పంచుకోవడం ప్రమాదకరమని సీపీ రష్మి పెరుమాళ్ హెచ్చరించారు. నివాస ప్రాంతం, రోజువారీ కార్యకలాపాలు, ప్రయాణ వివరాలు వంటి సమాచారాన్ని సోషల్ మీడియాలో ఎక్కువగా పోస్ట్ చేయవద్దని సూచించారు. సోషల్ మీడియా ప్రొఫైళ్లను వీలైనంత వరకు ప్రైవేట్గా ఉంచుకోవాలని తెలిపారు.

వాట్సాప్ స్టేటస్లలో ఇంటి చిరునామా, తాము ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నామనే వివరాలను బహిర్గతం చేయకపోవడం మంచిదని పేర్కొన్నారు. ఇలాంటి జాగ్రత్తలు సైబర్ మోసాలనే కాకుండా, వ్యక్తులు ఇంట్లో లేని సమయంలో జరిగే భౌతిక నేరాల ప్రమాదాన్ని కూడా తగ్గించడంలో సహాయపడతాయని వివరించారు.

## సైబర్ మోసానికి గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలి

సైబర్ నేరాల బారిన పడిన వారు భయపడకుండా, ఆలస్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సీపీ సూచించారు. మోసపోయిన వెంటనే ₹₹1930 సైబర్ క్రైమ్ హెల్ప్లైన్₹₹కు ఫోన్ చేయాలని లేదా రీరీరీ.ఛిఢ్భటఛిటజీర్ఖ్భ.జౌరి.జీ వెబ్సైట్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. సకాలంలో ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన మొత్తాన్ని గుర్తించి, తిరిగి పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకునే అవకాశం మెరుగుపడుతుందని వివరించారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవడం, డిజిటల్ లావాదేవీల్లో జాగ్రత్తలు పాటించడం, అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే గుర్తించడం ద్వారా వ్యక్తిగతంగా, కుటుంబపరంగా ఆర్థిక నష్టాలను నివారించవచ్చని పేర్కొన్నారు.

సాంకేతికతను తెలివిగా వినియోగించుకుందాం.. సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా అప్రమత్తంగా ఉందాం.. డిజిటల్ భద్రతను ప్రతి ఒక్కరి బాధ్యతగా మార్చుకుందాం అని సీపీ రష్మి పెరుమాళ్ పిలుపునిచ్చారు.

---

# అక్టోబర్ 14న జర్నలిస్టుల ఉచిత వైద్య శిబిరం

**ముఖ్య అతిథులుగా హాజరుకానున్న జిల్లా కలెక్టర్,టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు**



సంగారెడ్డి, అక్టోబర్ 12 మనం న్యూస్ ప్రతినిధి : , జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరీక్షల కోసం అక్టోబర్ 14న సంగారెడ్డిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ సిద్దిఖ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చౌహాన్ తెలిపారు. స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో, స్నైజ్ ఆసుపత్రి, రథసారథి తెలుగు దినపత్రిక సహకారంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 14న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సంగారెడ్డిలోని స్నైజ్ ఆసుపత్రిలో శిబిరం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ. ఖాదర్ ఫైసల్ ముఖ్య అతిథిగా, జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి గౌరవ అతిథిగా హాజరుకానున్నారు. శిబిరంలో స్నైజ్ ఆసుపత్రికి చెందిన గుండె వైద్యులు, మధుమేహం, ఎముకలు, మెదడు, నాడీ సంబంధిత వ్యాధులు, చిన్నపిల్లలు, మహిళలకు, సాధారణ వైద్య విభాగాల నిపుణులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వైద్య సలహాలు అందజేస్తారు. వివిధ రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు అందుబాటులో ఉన్న మందులను కూడా ఉచితంగా పంపిణీ చేయనున్నారు. జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్, చిన్న, పెద్ద దినపత్రికలు, కేబుల్ మీడియా, సామాజిక మాధ్యమాల ప్రతినిధులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ వైద్య శిబిరంలో పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి హాజరయ్యేవారు సమయపాలన పాటించాలని విజ్ఞప్తి చేశారు.

---

# ఎల్గోయి భవానీ ఆలయంలో వైభవంగా గాయత్రీ మాత అలంకారోత్సవం

**మాజీ సర్పంచ్ విఠల్ రావు పాటిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు**



మనూర్, అక్టోబర్ 12 (మనం న్యూస్):నారాయణఖేడ్ నియోజకవర్గం మనూర్ మండలంలోని ఎల్గోయి గ్రామ పంచాయతీ పరిధిలో కొలువుదీరిన శ్రీ భవానీ అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.

ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజైన సోమవారం నాడు అమ్మవారు గాయత్రీ మాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ప్రాంగణంలో గాయత్రీ మాతకు ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్గోయి గ్రామ మాజీ సర్పంచ్ విఠల్ రావు పాటిల్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి మాల ధరించిన స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొని, భక్తి పారవశ్యంతో భజనలు, కోలాటాలు చేస్తూ ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు.

అనంతరం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, కుంకుమార్చన, సహస్రనామార్చన నిర్వహించారు. గ్రామ ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ విఠల్ రావు పాటిల్ మాట్లాడుతూ... నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని, అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సస్యశ్యామలంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళా భక్తులు మరియు భవానీ మాలధారణ స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

---

# కార్యకర్తల కుటుంబానికి అండగా నేనుంటా

**బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు, సి జి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ : చిమ్ముల. గోవర్ధన్ రెడ్డి**



గుమ్మడిదల ( మనం న్యూస్) అక్టోబర్ 12 : పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్త కుటుంబానికి తాను అండగా ఉంటానని బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు, సి జి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చిమ్ముల. గోవర్ధన్ రెడ్డి తెలిపారు. సోమవారం నాడు అనంతరం సీనియర్ నాయకుడు పెరుగు. సాయిలు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఆ కుటుంబాన్ని ఓదార్చి అన్ని విధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము. శ్రీను, ఉప సర్పంచ్ యాదిరెడ్డి, నాయకులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉద్యమానికి, ఓటు హక్కుల పరిరక్షణ పోరాటానికి సంపూర్ణ మద్దతు

**టివైజేఎఫ్ అధ్యక్షులు డాక్టరు జితేందర్ రావు తనుగుల**

**రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య బలోపేతం, సామాజిక న్యాయం కోసం దేశ ప్రజలంతా ఐక్యంగా నిలవాలి**



జహీరాబాద్ అక్టోబరు 12 మనం న్యూస్: దేశంలో రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల బలోపేతం, సామాజిక న్యాయం కోసం విద్యార్థులు, ప్రజాస్వామ్య వాదులు చేస్తున్న పోరాటాలకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టివైజేఎఫ్) అధ్యక్షుడు డాక్టరు జితేందర్ రావు తనుగుల విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల ఉద్యమానికి ఓటు హక్కుల పరిరక్షణ పోరాటానికి తమ సంఘం బేషరతుగా, సంపూర్ణంగా మద్దతు పలుకుతుందని ఆయన వెల్లడించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో విద్యార్థులు తమ హక్కులు, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం కోసం నిర్వహిస్తున్న ఉద్యమాలకు ప్రజలు సంఘీభావం ప్రకటించాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టరు బిఆర్ అంబేద్కర్ ఆశయాలను విశ్వసించే విద్యార్థులతో పాటు ప్రజాస్వామ్య, సామాజిక న్యాయ భావజాలం కలిగిన యువత, మార్క్సిస్టు, కమ్యూనిస్టు భావజాలాన్ని అనుసరించే విద్యార్థులు, రాజ్యాంగ విలువలను కాపాడాలని కోరుకునే ప్రజలందరూ శాంతియుత ఉద్యమాలకు అండగా నిలవాలని ఆయన కోరారు.అదేవిధంగా, దేశ ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్న ఓటు హక్కును పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని డాక్టరు జితేందర్ రావు తనుగుల స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడుతున్నా యనే ఆందోళనల నేపథ్యంలో, ఓటు హక్కుల పరిరక్షణ కోసం సిటిజెన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ (సీజేపీ) చేస్తున్న పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

ఓటర్ల జాబితాల సవరణ పారదర్శకంగా, చట్టబద్ధమైన నిబంధనలకు అనుగుణంగా జరగాలని ఆయన కోరారు. అర్హులైన ఏ పౌరుడూ తన ఓటు హక్కును కోల్పోకుండా ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పొరపాటున ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించబడితే, బాధితులకు అభ్యంతరాలు తెలిపేందుకు, తమ పేర్లను తిరిగి చేర్చుకునేందుకు చట్టబద్ధమైన అవకాశం కల్పించాలని ఆయన డిమాండు చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో అవకతవకలు లేదా నిర్లక్ష్యం జరిగినట్లు ఆధారాలతో నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన మరోమారు డిమాండు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనరు జ్ఞానేశ్ కుమ్రా చర్యలు తీసుకోవాలనే డిమాండుతో సహా ఈ వ్యవహారానికి సంబంధించి వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులను నిష్పక్షపాతంగా పరిశీలించాలని, తప్పిదాలు నిర్ధారణ అయిన పక్షంలో చట్టప్రకారం తగిన చర్యలు చేపట్టాలని కోరారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ , క్రైస్తవ మైనారిటీలతో పాటు అగ్రవర్ణాలు, ఓసీలు సహా అన్ని సామాజిక వర్గాల ప్రజలు, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు, అర్హులైన పౌరుల ఓటు హక్కుల పరిరక్షణకు మద్దతుగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలు ఏ ఒక్క కులానికి, మతానికి లేదా రాజకీయ భావజాలానికి మాత్రమే పరిమితమైనవి కావని, దేశంలోని ప్రతి పౌరుడి హక్కులు, భవిష్యత్తుతో ముడిపడి ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడటం, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు మద్దతు ఇవ్వడం, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడం దేశ ప్రజలందరి బాధ్యత అని డా. జితేందర్ రావు తనుగుల పేర్కొన్నారు. సమానత్వం, సోదరభావం, సామాజిక న్యాయం ఆధారంగా సమాజ నిర్మాణం జరగాలంటే ప్రజలంతా ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు.



# గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

**రూ.71.40 లక్షల విలువైన 142.8 కిలోల ఎండు గంజాయి స్వాధీనం**

**ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్.. రెండు కార్లు సీజ్**

కంది మనం న్యూస్, అక్టోబర్ 12: సంగారెడ్డి జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. కంది ఎక్స్ రోడ్డు వద్ద సోమవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.71.40 లక్షల విలువైన 142.8 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేసి, గంజాయి తరలింపునకు ఉపయోగించిన రెండు కార్లను సీజ్ చేశారు.

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు సంగారెడ్డి ఎస్-న్యాబ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్రావు, సంగారెడ్డి రూరల్ సీఐ నయీముద్దీన్, ఎస్ఐ మధుసూదనరెడ్డి, సీసీఎస్ ఎస్ఐ శ్రీకాంత్, సంగారెడ్డి టౌన్ ఎస్ఐ వెంకటేశం సిబ్బందితో కలిసి నమ్మదగిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టారు. పటాన్చెరు నుంచి సంగారెడ్డి వైపు వస్తున్న హ్యుండాయ్ ఎక్సెంట్, మారుతి సుజుకి స్విఫ్ట్ కార్లను తనిఖీ చేయగా, హ్యుండాయ్ ఎక్సెంట్ కారులో 35 ప్యాకెట్లలో తరలిస్తున్న గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసులో ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన రోషన్ కర్జీ (26), బిబుధ రాజ్ (22)లను అరెస్ట్ చేసి న్యాయస్థానం ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్కు తరలించారు. సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్లో క్రైమ్ నంబర్ 588/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ సాగు, రవాణా, సరఫరా, విక్రయాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే ఎస్-న్యాబ్ నంబర్ 8712656777కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

# సిద్దిపేటలో 'వార్తాలి వస్త్రాలయం' ప్రారంభం

- **సిద్దిపేట హౌసింగ్ బోర్డు కాలనీలో వార్తాలి వస్త్రాలయం ఘనంగా ప్రారంభోత్సవం**
- **నూతన వస్త్రాలయాన్ని ప్రారంభించిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్రెడ్డి**
- **నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు**





మనం న్యూస్ - సిద్దిపేట రిపోర్టర్ అక్టోబర్ 12: సిద్దిపేట పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వార్తాలి వస్త్రాలయాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్రెడ్డి, బక్కి వెంకటయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు వస్త్రాలయాన్ని సందర్శించి, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధిస్తూ, వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు.

దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డి పట్టణానికి చెందిన వార్తాలి వస్త్రాలయం, సిద్దిపేటలో నూతన శాఖను ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులను పలువురు నాయకులు అభినందించారు. వ్యాపార విస్తరణలో భాగంగా సిద్దిపేట పట్టణంలో నూతన వస్త్రాలయాన్ని ప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు. కొత్త వ్యాపార సంస్థల ఏర్పాటుతో పట్టణంలో వాణిజ్య కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.వస్త్ర వ్యాపార రంగంలో వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వివిధ రకాల వస్త్రాలను అందుబాటులో ఉంచుతూ, ప్రజల ఆదరణ పొందాలని నిర్వాహకులకు సూచించారు. వ్యాపారంలో నమ్మకం, నాణ్యత, వినియోగదారుల సంతృప్తికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సోలిపేట సతీష్రెడ్డి, తోట కమలాకర్రెడ్డి, సుకూరి లింగం, చార్వాక కుమార్, మహేష్రెడ్డి, నితిన్, సాయి తదితర నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని వస్త్రాలయ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# నేడు జహీరాబాద్లో సీజన్2 నవరాత్రి గార్బా-దాండియా నైట్ స్టిక్స్ డ్యాన్స్

**యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పిపి) సుభాష్ రాథోడ్ పిలుపు**

**నిర్వాహకులతో కలిసి నవరాత్రి గార్బా-దాండియా పోస్టరు ఆవిష్కరణ**



జహీరాబాద్ అక్టోబరు 12 మనం న్యూస్: జహీరాబాద్ పట్టణంలోని భారత్ నగర్- పస్తాపూర్, అలీపూర్- డిడిగి, బీదర్ రహదారి పక్కన గల పివిఆర్ గార్డెన్ ఫంక్షను హాలులో ఈనెల 12వ తేదిన రాత్రి సీజన్2 నవరాత్రి గార్బా, దాండియా నైట్స్ స్టిక్స్ డ్యాన్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ గార్బా-దాండియా నైట్ స్టిక్స్ డ్యాన్స్ (వాల్ పోస్టరు) గోడ పత్రికను జహీరాబాద్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటరు సుభాష్ రాథోడ్ ఆవిష్కరించి, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జహీరాబాద్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పిపి) సుభాష్ రాథోడ్ మాట్లాడుతూ పర్వదినాలు అనేవి ఐక్యతకు సూచికని అన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా యువతీలు, మహిళలు సాంప్రదాయ నృత్యంతో ఉల్లాసంగా, ఉత్సాహవంతంగా కార్యక్రమాన్ని జరిగే విధంగా నిర్వాహకులు జాగ్రత్తలు పడాలని విజ్ఞప్తి చేశారు.గార్బా- దాండియా కార్యక్రమం మరింత విజయవంతం చేయడానికి తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తానని, ముఖ్యంగా మహిళలు, యువతీలు పాల్గొనే కార్యక్రమమయినందుకు అన్నీ రకాల జాగ్రత్తలు పాటించాలని కోరారు. యువతీలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొని సాంప్రదాయబద్ధంగా గార్బా -దాండియా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# విద్యుత్ కోతలపై బీఆర్ఎస్ ధర్నా, రాస్తారోకో

**వ్యవసాయానికి 12 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలి**
**వొడితల సతీష్ కుమార్ మాజీ ఎమ్మెల్యే, హుస్నాబాద్**





హుస్నాబాద్, రిపోర్టర్,: అక్టోబర్ 12, మనం న్యూస్: వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ విమర్శించారు. విద్యుత్ కోతలు, లో వోల్టేజీ సమస్యలను పరిష్కరించి వ్యవసాయానికి రోజుకు 12 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం హుస్నాబాద్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి ఆయన ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.

హుస్నాబాద్ పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో ఉన్న విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం, సబ్స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నిరసించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, కనీసం నాలుగు గంటలు కూడా సక్రమంగా సరఫరా కావడం లేదని ఆరోపించారు. తరచూ విద్యుత్ కోతలు, లో వోల్టేజ్ కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని పేర్కొన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ఉచిత విద్యుత్, సాగునీరు, రైతుబంధు వంటి పథకాల ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేశామని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.ప్రజాపాలన పేరుతో ప్రచారం చేసుకోవడం కాదని, రైతులకు అవసరమైన విద్యుత్ను సక్రమంగా అందించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం చేతికందే దశలో ఉన్న పంటలకు సాగునీరు అందించేందుకు అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని, రైతుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని సతీష్ కుమార్ స్పష్టం చేశారు. అనంతరం ఎస్పీడీసీఎల్ హుస్నాబాద్ డి ఈ అధికారికి వినతి పత్రం సమర్పించి హుస్నాబాద్ నియోజకవర్గంలో నాణ్యమైన విద్యుత్ ను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెరుక భాగ్యరెడ్డి, ప్రధాన కార్యదర్శి చిత్తారి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి ఇంద్రాల సారయ్య, కౌన్సిలర్లు గాదెపాక రవీందర్, బొల్లి శ్రీనివాస్, గడిపె సంపత్, మాజీ పట్టణ అధ్యక్షులు కన్నోజు రామకృష్ణ, ఎం.ఏ. అన్వర్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీలు లకావత్ మానస, భూక్య మంగ, బానోతు లక్ష్మీ బీలు నాయక్, మాజీ కౌన్సిలర్లు భూక్య లక్ష్మణ్ నాయక్, బొజ్జ హరీష్, నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు అయిలేని శంకర్ రెడ్డి, నాయకులు కుతాటి విజయ్ భాస్కర్, దకూరి భూపతి రెడ్డి, పూదరి రవీందర్ గౌడ్, వాల నవీన్ రావు, బూర వెంకన్న గౌడ్, చిదురాల అశ్విని, బండి పుష్ప, అక్కన్నపేట, హుస్నాబాద్ పట్టణ, మండల మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బీరంగూడ డివిజన్ అభివృద్ధే లక్ష్యం..

**ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం**
**- అమీనూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి**
**- బీరంగూడ డివిజన్లోని కాలనీల సమస్యలను పరిష్కరించండి**
**- సీఎంసీ కమిషనర్ జి.సృజనకు శశిధర్ రెడ్డి వినతి**



అమీనూర్, అక్టోబర్ 12 (మనం న్యూస్): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, అమీనూర్ ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నట్టు అమీనూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ జి. సృజన అమీనూర్ సర్కిల్ పరిధిలో పర్యటించిన సందర్భంగా శశిధర్ రెడ్డి ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీరంగూడ డివిజన్ పరిధిలోని బీహెచ్ఈఎల్ మెట్రో కాలనీ, సూర్యోదయ కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు చేపట్టాల్సిన పనులపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. బీరంగూడ ప్రాంత అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ తన సేవలను కొనసాగిస్తానని శశిధర్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఎల్ఐజి కాలనీలో భక్తిశ్రద్ధలతో శ్రీ సత్యసాయి బాబా పల్లకీ సేవ

**- పాల్గొన్న మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి**
**- ప్రేమ, సేవ, మానవత్వమే బాబా బోధనల సారాంశం**





రామచంద్రాపురం, అక్టోబర్ 12 (మనం న్యూస్): శ్రీ సత్యసాయి బాబా 101వ జయంతి వేడుకలను పురస్కరించుకుని బీహెచ్ఈఎల్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఎల్ఐజి కాలనీలో నిర్వహించిన పల్లకీ సేవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమానికి భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి హాజరై పల్లకీ సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె శ్రీ సత్యసాయి బాబా ఆశీస్సులు పొందారు. భక్తులు భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తి భావాన్ని చాటగా, పల్లకీ సేవ కార్యక్రమం ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక సందడిని నింపింది. శ్రీ సత్యసాయి బాబా బోధించిన ప్రేమ, సేవ, మానవత్వం, సమానత్వం వంటి ఉన్నత విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని ఈ సందర్భంగా సింధు ఆదర్శ్ రెడ్డి ఆకాంక్షించారు. మానవ సేవే మాధవ సేవ అనే సత్యసాయి బాబా సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో సేవాభావాన్ని పెంపొందించాలని ఆమె పేర్కొన్నారు. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మేలు చేకూర్చడం అభినందనీయమని తెలిపారు.

# కోహెడలో విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం

**హాజరైన మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్**





కోహెడ, అక్టోబర్ 12 (మనం న్యూస్): కోహెడ మండల కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశానికి హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు శ్రీ వొడితల సతీష్ కుమార్ గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పార్టీ సంస్థాగత బలోపేతం, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడం వంటి అంశాలపై చర్చించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు మనోధైర్యం నింపుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ ప్రజలతో మమేకమై పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో కోహెడ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# గుమ్మడిదల 18వ వార్డులో అక్రమ షెడ్లు నిర్మూలించండి.

**స్థానిక కౌన్సిలర్: నర్సంపల్లి. రాజిరెడ్డి**

గుమ్మడిదల ( మనం న్యూస్ ) అక్టోబర్ 12 : గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారుల్లో కొంతమంది అక్రమంగా షెడ్లు వేసి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ గుమ్మడిదల మున్సిపల్ కమిషనర్ తో పాటు సంబంధిత శాఖ అధికారులు ఎటువంటి స్పందన చూపించకపోవడంలో అంతరేమిటో అర్థం కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.